క్లుప్తంగా

నేడు వీఆర్ గ్రౌండ్స్‌లో ఆసరా చెక్కుల పంపిణీ

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో వైఎస్సార్ ఆసరా చెక్కుల కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు తాడిగడప మున్సిపాలిటీ మేనేజర్ ఎస్.విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్ సిద్ధార్థ కాలేజీ గ్రౌండ్స్‌లో బుధవారం సాయంత్రం 4 గంటలకు యనమలకుదురు, తాడిగడప సర్కిల్ పరిధిలో డ్వాక్రా మహిళలకు చెక్కులను గృహనిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలతో పాటు అన్ని శాఖల సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ.. యనమలకుదురులో ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిపివేస్తామన్నారు. దీని కారణంగా డొంకరోడ్డు, ఇందిరానగర్ 1, 2 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. స్థానికులు గమనించి తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకికి చెందిన యువతి(17) విజయవాడలోని ఓ వస్త్రాల దుకాణంలో పని చేస్తుంది. అయితే ఆమె బంధువు నాగ రవీంద్ర ప్రేమిస్తున్నానని వేధిస్తూ, ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు వ్యక్తులపై బైండోవర్ కేసు నమోదు

పెనమలూరు: ఇద్దరు వ్యక్తులపై పోలీసులు మంగళవారం బైండోవర్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ గురునానక్‌నగర్ కాలనీ ప్రాంతానికి చెందిన పాత నేరస్తులు అబ్దుల్ సోహెల్, భవానిఆంథోని అనే వ్యక్తులు పెనమలూరులో అనుమానాస్పదస్థితిలో సంచరిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని బైండోవర్ కేసు నమోదు చేశారు.

అసైన్‌మెంట్ భూములకు రిజిస్ట్రేషన్లు

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం 2003వ సంవత్సరానికి ముందు పేదలకు పంపిణీ చేసిన అసైన్‌మెంట్ భూములకు ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తుందని విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. నిషేధిత జాబితాలో నుంచి తొలగించి రెగ్యులర్ చేయడం వలన లబ్ధిదారులకు భూములు విక్రయించుకునే సదుపాయం కలుగుతుందన్నారు. మండలంలో కొత్తూరు.తాడేపల్లి, వేమవరం, షాబాదు, జక్కంపూడి గ్రామాల్లో 122 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. లబ్ధిదారుల వివరాలను ముందుగా ఆన్‌లైన్ చేసి ఆ వివరాలను సబ్ కలెక్టర్ లాగిన్‌కు పంపామని, పిమ్మట ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు దాత భోదటి శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ దంపతులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్, అర్చకులు పర్యవేక్షించారు.

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా 16న ఆందోళన

గన్నవరం: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన జరగనున్న దేశవ్యాప్త ఆందోళన చేపట్టనున్నట్లు ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా కార్మికులు, రైతులు, నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. వీటికి నిరసనగా దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా గ్రామీణ భారత్ నిరసనలలో అన్ని వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజా సంఘాల నేతలు ముక్కామల ఉమామహేశ్వరరావు, చిన్నా, సూరగాని సాంబశివరావు, కాట్రగడ్డ జోషి, బి.నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులోని జగనన్న కాలనీ

జగనన్న ఊళ్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పేదలందరికీ ఇళ్లు పథకంతో రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఊళ్లు ఏర్పడుతున్నాయి. జగనన్న కాలనీల్లో యుద్ధప్రాతిపదికన వసతులు కల్పించడంతో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. కృష్ణా జిల్లా మద్దూరు, వణుకూరు రోడ్డులో జగనన్న కాలనీలో సిద్ధమైన ఇళ్లను చిత్రాల్లో చూడవచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వణుకూరులో..

మహిళలను లక్షాధికారులను చేశారు సీఎం జగనన్న

- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్
- కంకిపాడులో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ
- సంక్షేమ పాలనకు అండగా నిలవాలని పిలుపు



కంకిపాడు సభలో మాట్లాడుతున్న రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్

కంకిపాడు: మహిళలను లక్షాధికారులను చేసిన ఏకైక సీఎం జగనన్న అని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నారు. కంకిపాడు ప్రధాన సెంటర్ డాక్టర్ వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ మహోత్సవం మంగళవారం రాత్రి నిర్వహించారు. కంకిపాడు, ప్రొద్దుటూరు, మద్దూరు, గొడవర్రు, కాసరనేనివారిపాలెం, ఈడుపుగల్లు గ్రామాలకు చెందిన 519 స్వయం సహాయక సంఘాల్లోని 5,190 మంది సభ్యులకు రూ.4.99 కోట్లు డాక్టర్ వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. బైపాస్ సెంటర్ నుంచి మంత్రి జోగి రమేష్ పాదయాత్రగా వేదిక ప్రాంగణానికి చేరుకుని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజలకు సంక్షేమం చేరువ..



సీఎం జగన్ ఫొటో చూపుతున్న మంత్రి జోగి రమేష్

జ్యోతి ప్రజల్వన చేసి సభనుద్దేశించి మంత్రి జోగి రమేష్ మాట్లాడారు. 2019 ఎన్నికల ముందు పాదయాత్రలో జగనన్న ప్రజల కష్టాలను తెలుసుకున్నారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కులం, మతం, రాజకీయం చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించి సంక్షేమ పాలన సాగిస్తున్నారని చెప్పారు. దేశం యావత్తూ స్ఫూర్తిగా తీసుకునేలా సీఎం జగన్ సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, గోరుముద్ద, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుభరోసా వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా సంక్షేమాన్ని విడవకుండా సంక్షేమాన్ని చేరువ చేశారన్నారు.

ఓటుతో గుణపాఠం చెప్పాలి..

సచివాలయం, వలంటీరు వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని మంత్రి చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఆస్పత్రుల అభివృద్ధి, గ్రామాలకు వైద్య సేవలు చేరవేసిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజా సంక్షేమం కోసం 124 సార్లు బటన్ నొక్కారని, తిరిగి ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికకు రెండు సార్లు ప్రజలు బటన్ నొక్కాలని విజ్ఞప్తి చేశారు. దోపిడీ దొంగలు, మోసగాళ్లు గూడుపుఠాణితో ఏకమై వస్తున్నారన్నారు. సంక్షేమ పాలన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విష రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాల మాటలను విశ్వసించొద్దని, రానున్న ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పెనమలూరు గడ్డపై విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సర్పంచ్ బాకీ రమణ, టిడ్కో, కమ్మ, ఉమెన్ ఫైనాన్స్, గౌడ కార్పొరేషన్ల డైరెక్టర్లు పి.రాఘవరావు, రామినేని రమాదేవి, నందిపాటి బిందుమాధవి, ఈడే చాముండేశ్వరి, యువనేత జోగి రాజీవ్, ఎంపీటీసీలు చిట్టూరి ప్రసాద్, బి.సురేష్, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరి రాణి, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, మైనార్టీ నేత షేక్ చిన్నా, నాయకులు వీరమాచనేని శ్రీనివాసరావు, జె.నాగేశ్వరరావు, నకరికంటి శేఖర్, బిళ్లా వెంకటేశ్వరరావు, కంకిపాటి రమేష్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అకుంఠిత దీక్షతో పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ బాపులపాడు మండల సర్వసభ్య సమావేశం స్థానిక విజయవాడ రోడ్డులోని కార్యాలయంలో మంగళవారం జరిగింది. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి మరోసారి తెలియజేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే నవరత్నాలు, సంక్షేమ పథకాలు అమలు అవుతాయని ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కలగచేయాలని పార్టీ శ్రేణులకు నక్కా గాంధీ సూచించారు.

సమష్టి కృషితో గెలుపు..

జేసీఎం మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామ కమిటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు సమాయత్తం కావాలని చెప్పారు. మళ్లీ



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నక్కా గాంధీ

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, గన్నవరం ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీమోహన్‌ను గెలిపించుకునేందుకు కార్యకర్తలు అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యకర్తల్లో అయోమయం సృష్టించేందుకు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, పార్టీ నాయకులు చెరుకూరి శ్రీనివాస్, కొడెబోయిన బాబి, గూడవల్లి సుధాకర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

బీసీలు ఐక్య పోరాటం చేయాలి




యనమలకుదురులో మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

పెనమలూరు: రాజ్యాధికారంలో భాగస్వామ్యం అయ్యేందుకు బీసీలు ఐక్య పోరాటం చేయాలని ఏపీ నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ద్రాక్షరపు సూరిబాబు పిలుపునిచ్చారు. యనమలకుదురులో మంగళవారం నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్‌లో భారతరత్నకు ఎంపికైన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్‌కు ఘననివాళులర్పించి అనంతరం జరిగిన రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొని ప్రసంగించారు. బీసీలు బలోపేతం కావటానికి అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రధానంగా యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. నాయీబ్రాహ్మణ సంఘం ఉద్యోగ సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీల హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. అన్ని రంగాల్లో బీసీలు రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, అయోధ్య సత్యనారాయణ, ఆకునూరు సుబ్బారావు, మద్దిరాల ఉమాశంకర్, అవనిగడ్డ వెంకటేశ్వర్లు తెన్నేటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

కంకిపాడు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. విద్యాసంస్థల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీ చైతన్య ఐఐటీ అకాడమీ ఎగ్జిక్యూటివ్ డీన్ కె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎం.మురళీ కృష్ణ మాట్లాడుతూ జేఈఈ మెయిన్ సెషన్–1 ఫలితాల్లో 300 మార్కులకు 300 మార్కులను అన్నారెడ్డి వెంకట తనిష్‌రెడ్డి సాధించాడన్నారు. నూరు శాతం 14 మంది, ఫిజిక్స్‌లో 100 శాతం 12 మంది, కెమిస్ట్రీలో 22 మంది సాధించారన్నారు. 99 శాతం పర్సంటేజ్ 288 మంది సాధించారని చెప్పారు. విద్యార్థుల అభ్యున్నతి లక్ష్యంగా బోధన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీన్స్ పీవీఆర్, మురళీరావు, కృష్ణారెడ్డి, శరత్ పాల్గొన్నారు.



విద్యార్థి వెంకట తనిష్ రెడ్డిని అభినందిస్తున్న అధ్యాపకులు

ఎయిడ్స్ నియంత్రణ అందరి బాధ్యత

గన్నవరంరూరల్: ఎయిడ్స్ నియంత్రణ అందరి సామాజిక బాధ్యత అని వీరపనేనిగూడెం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, చైల్డ్ ఫండ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సచివాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ వైద్యులు సూచించిన విధంగా టెస్టులు, మందులు వినియోగించాలని సూచించారు. ఈ మేరకు రోగుల్లో అవగాహన పెంచాలన్నారు. జిల్లా రిసోర్స్‌పర్సన్ డాక్టర్ లక్ష్మీనాయక్, పంచాయితీ కార్యదర్శి బాపూజీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సర్పంచ్ జేజమ్మ

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం

రామవరప్పాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పేదలకిచ్చిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వేగవంతంగా జరుగుతుంది. ఇప్పటి వరకు రామవరప్పాడులో 750, ప్రసాదంపాడులో సుమారు 1000, ఎనికేపాడులో 525, నిడమానూరులో 640 ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. సెలవు రోజులతో పాటు అదనపు సమయం వెచ్చించి ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో మిగిలిన లబ్ధిదారులు తమ పరిధిలోని సచివాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సూచిస్తున్నారు.

ఘనంగా సరోజిని నాయుడు జయంతి



కానూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెనమలూరు: పోరాటయోధురాలు సరోజిని నాయుడు తన ఉపన్యాసాలతో ప్రజలకు దేశభక్తిని నూరిపోశారని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర అన్నారు. సరోజినినాయుడు జయంతి సందర్భంగా కాలేజీలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ.. సరోజినినాయుడు తన ఉపన్యాసాలతో ప్రజల్లో దేశభక్తి పెంపొందించారన్నారు. తన మొదటి కవిత్వం ద్వారా నైటింగల్ ఆఫ్ ఇండియాగా ప్రపంచ ఖ్యాతి పొందారని చెప్పారు. జాతి వేరు, దేశం వేరు, నీవు వేరని విడిగా ఉండరాదని, అలా అనుకుంటే దేశం అనుభవించే బానిసత్వం నీవు అనుభవించాల్సింటుందని ఆమె ప్రజలకు తెలియజేశారన్నారు. ర్యాలీలో విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య అవసరాలకు అమలు చేస్తున్న జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఎస్.సాయిలలిత అన్నారు. గంగూరు – 2 సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభించి ఆమె ప్రసంగించారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకు వచ్చిందన్నారు. జగనన్న ఆరోగ్య శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 250 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్బర్‌పాషా మాట్లాడుతూ జగనన్న పాలనలో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు. ప్రతి గ్రామంలో నేడు హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంరక్షణ

కంకిపాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్య సంరక్షణ జరుగుతుందని వక్తలు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2లో భాగంగా ఈడుపుగల్లు సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అంజు మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడకుండా ఉండాలనే భావనతో ప్రభుత్వం వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన మందులు అందుబాటులో ఉంచిందన్నారు. శస్త్రచికిత్సలకు ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు తరలిస్తున్నామన్నారు. వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, వైద్యులు డాక్టర్ రెహమాన్, ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్, సీహెచ్‌ఓ ఝాన్సీకుమారి, పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం అనిత, ఆశ కార్యకర్తలు ఐఎస్‌బిఎస్ కుమారి, స్వర్ణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



గంగూరులో మెడికల్ కిట్ అందజేస్తున్న వైద్యురాలు సాయిలల



ఈడుపుగల్లులో సేవలందిస్తున్న వైద్య బృందం

బోడపాడు గ్రామ నీటి కష్టాలకు పరిష్కారం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ శివారు బోడపాడు గ్రామంలో కొన్నేళ్లుగా ఉన్న నీటి సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా చేపట్టిన చర్యలతో జల్‌జీవన్ మిషన్ నిధులు 35 లక్షల రూపాయలతో గంగానమ్మ గుడి వద్ద ఒక బోరు, శ్మశానవాటిక వద్ద మరో బోరు ఏర్పాటు చేస్తున్నారు. రెండు బోరులతో పాటు అవసరమైన పైపులైను పనులు వేగవంతంగా నిర్మిస్తున్నారు. బోర్లు వద్ద ఏర్పాటు చేసిన మోటార్లతో నీటిని తోడి కో ఆపరేటివ్ గోడౌన్ వద్ద ఉన్న 60 వేల లీటర్ల ట్యాంక్‌లో నీరు నిల్వ చేసి వాటిని బోడపాడు గ్రామానికి సరఫరా చేయనున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ కె.శ్వేత తెలిపారు. ఎన్నో ఏళ్ల తరబడి బోడపాడు గ్రామాన్ని పట్టిపీడిస్తున్న నీటి సమస్యలకు త్వరలోనే మోక్షం ఏర్పడనుంది.



నున్నలో ఏర్పాటు చేస్తున్న బోరు

ప్రణాళికా బద్ధంగా నీటి సరఫరా

నున్న గ్రామంలో ఒక ప్రణాళిక బద్ధంగా నీటి సరఫరా చేస్తున్నాం. బోడపాడు గ్రామానికి 38 లక్షల రూపాయలతో రెండు బోర్లు వేసి పైపులైను ద్వారా త్వరలోనే ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. అదే విధంగా విశ్వబ్రాహ్మణ కాలనీకి కూడా జెజెఎం నిధులు 29 లక్షలు వెచ్చించి బోరు, పైపులైను వేస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తాం. నీటి సరఫరా, నున్న మెయిన్ విలేజీకి రూ.2.87 కోట్లు జెజెఎం మంజూరైంది. – కాటూరి సరళ, నున్న సర్పంచ్

శరవేగంగా అభివృద్ధి పనులు

ఉంగుటూరు: మండల పరిధిలోని తేలప్రోలులో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గ్రామ స్థాయిలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో పాటు వాటికి అవసరమైన వనరులను సమకూరుస్తోంది. దీనిలో భాగంగా తేలప్రోలులో రూ.79 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, ఆర్బీకే, రెండు వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇప్పటి వరకు అద్దె భవనాల్లో పౌరసేవలు అందించిన త్వరలో సొంత భవనాల నుంచి సేవలు అందించనున్నారు. రూ.40 లక్షలతో రెండు అంతస్తుల సచివాలయ భవనం, వైద్య సేవలు అందించేందుకు రూ.17.50 లక్షలతో వెల్‌నెస్ సెంటర్లతో పాటు రైతులకు వ్యవసాయ సంబంధిత సేవలు అందించేందుకు రూ.21.80 లక్షలతో నూతన ఆర్బీకే భవనం నిర్మాణం చేశారు.



తేలప్రోలులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయ భవనం

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన తప్పనిసరి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికీ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనతో పాటుగా వాటిని అమలు చేయడం తప్పనిసరి అని మారుతీ సుజుకీ డ్రైవింగ్ స్కూల్ మేనేజర్ వల్లభనేని వెంకట్రావు చెప్పారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఐసీఏఐ భవన్‌లో రోడ్డు భద్రత మార్గదర్శకాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. వెంకట్రావు మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు.

సౌత్‌జోన్ రోప్ స్కిప్పింగ్‌లో కాంస్య పతకం

కంకిపాడు: సౌత్ జోన్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ విద్యార్థికి కాంస్య పతకం లభించింది. సత్తా చాటిన విద్యార్థి జి.గోవర్ధన్ మణిదీప్‌ను విద్యాసంస్థల సీఏసీ సుధ, ప్రిన్సిపాల్ జె.పద్మావతి మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 10, 11వ తేదీల్లో గుంటూరులో సౌత్ ఇండియా రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో అండర్–14 విభాగంలో స్పీడ్ ఆఫ్ కేటగిరీలో పాఠశాల విద్యార్థి జి.గోవర్ధన్ మణిదీప్‌కు కాంస్య పతకం దక్కిందన్నారు. చదువుతో పాటుగా క్రీడల్లోనూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.



కాంస్య పతకంతో గోవర్ధన్ మణిదీప్